www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 19 సెప్టెంబరు 2025



అపాయింట్‌మెంట్ లెటర్ల ప్రక్రియ వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెగా డిఎస్‌సి 2025లో ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చే ప్రక్రియ వాయిదా పడింది. ఈ మేరకు విద్యాశాఖాధికారులకు కమిషనరేట్ నుంచి ఆదేశాలు అందాయి. తదుపరి తేదీ తర్వాత తెలియజేస్తామని అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. వాస్తవానికి శుక్రవారం ఉదయం ఏలూరు నుంచి ఎంపికైన 1063 మంది అభ్యర్థులు విజయవాడ బయలుదేరి వెళ్లాల్సి ఉంది. వారందరినీ గురువారం సాయంత్రానికి ఏలూరు చేరుకోమని ఆదేశాలు ఇచ్చి వారందరికీ నగరంలోని పది పాఠశాలల్లో రాత్రికి బస చేసేందుకు వసతి సౌకర్యాలు కల్పించారు. అయితే కార్యక్రమం వాయిదా పడటంతో తిరిగి ప్రభుత్వం అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చే తేదీ ప్రకటించే వరకు అభ్యర్థులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



'స్మార్ట్'గా.. బిగించేస్తున్నారు..!

ఇళ్లకూ స్మార్ట్ మీటర్ల బిగింపుతో జనాల్లో ఆందోళన

ఇప్పటికే రెండు జిల్లాల్లో 82 వేల మీటర్లు బిగింపు

పాత మీటర్‌లో ఇబ్బందులొస్తే వెంటనే స్మార్ట్ మీటర్ బిగింపు

వివరం చెప్పకుండానే వినియోగదారుల నుంచి సంతకాలు

మీటర్ల బిగింపు వేగవంతానికి కాంట్రాక్ట్ పద్ధతిన అప్పగింపు

స్మార్ట్ మీటర్లతో ఇప్పటికే వ్యాపారులు గగ్గోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఏలూరు నగరం పత్తేబాద్ ప్రాంతానికి చెందిన జి.శేషగిరి ఇంటి విద్యుత్ మీటర్ ఆగిపోయింది. దీంతో మీటర్ మార్పు కోసం విద్యుత్ శాఖాధికారులను సంప్రదించారు. ఇప్పటి వరకూ ఉన్న సాధారణ మీటర్ కాకుండా స్మార్ట్‌మీటర్ తెచ్చి బిగించేశారు. పూర్తి వివరాలు చెప్పకుండానే సంతకం చేయించుకున్నారు. స్మార్ట్ మీటర్ అని తెలిసి కుటుంబసభ్యులు లబోదిబోమంటున్నారు. స్మార్ట్ మీటర్ తీసేసి సాధారణ మీటర్ బిగించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని పరిస్థితి ఉంది'.

పైన చెప్పిన శేషగిరే కాదు.. స్మార్ట్ మీటర్ల బిగింపుతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులు పెద్దఎత్తున ఆందోళనకు గురవుతున్నారు. అదానీ కంపెనీకి లాభం చేకూర్చేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్, రాష్ట్రంలో కూటమి సర్కార్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై జనం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్రభుత్వం రూట్‌మార్చి ముందుకు సాగుతోంది. 'స్మార్ట్ మీటర్ల బిగింపుపై బలవంతం ఉండదు. వినియోగదారుడు అంగీకరిస్తేనే స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తాం' అని చెప్పి అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. వినియోగదారుల అభిప్రాయంతో సంబంధం లేకుండా మాయమాటలు చెప్పి అడ్డదారుల్లో ముందుకెళ్తోంది. గృహ వినియోగదారులు ఎవరైనా తమ మీటరు స్ట్రక్ అయ్యిందనిగాని, ఇతర ఫిర్యాదు చేసినా వెంటనే అక్కడ స్మార్ట్‌మీటర్ బిగించేస్తున్నారు. స్మార్ట్‌మీటర్ గురించి పూర్తి వివరాలు చెప్పకుండా వినియోగదారులతో విద్యుత్ సిబ్బంది సంతకాలు చేయిస్తున్న పరిస్థితి ఉంటోంది. అసలు విషయం తెలిసి వారంతా గగ్గోలు పెడుతున్నారు. స్మార్ట్ మీటర్ తొలగించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా వినిపించుకోని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 సెప్టెంబర్ నుంచి స్మార్ట్‌మీటర్లు బిగింపు ప్రారంభించింది. వ్యాపార దుకాణాలకు, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఇళ్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రారంభించింది. ఏలూరు జిల్లాలో మొత్తం ఆరు లక్షల మూడు వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ముందుగా లక్షా ఎనిమిది వేల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 34,955 స్మార్ట్ మీటర్లను అమర్చారు. ఇందులో గృహ విద్యుత్ కనెక్షన్లు 3,909 ఉండగా, వ్యాపార, పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు 31,046 ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు ఆరు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా తొలివిడతగా లక్షా 56 వేల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 47,614 కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు పూర్తి చేశారు. ఇందులో గృహ విద్యుత్ కనెక్షన్లు 2,694 ఉండగా, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు 44,920 ఉన్నాయి. సోలార్ కనెక్షన్ పెట్టుకున్న ప్రతి ఇంటికీ స్మార్ట్‌మీటర్ బిగిస్తున్న పరిస్థితి ఉంది. విద్యుత్ మీటర్ ఆగిపోయినా, సోలార్ ఏర్పాటు చేసుకోవాలనుకున్నా స్మార్ట్ మీటర్ బిగిస్తున్నారు. తొలుత వినియోగదారులకు ఏమీ అర్థం కావడం లేదు. తర్వాత స్మార్ట్ మీటర్ గురించి తెలుసుకుని తొలగించాలని కోరుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే స్మార్ట్‌మీటర్ ఏర్పాటు చేసిన వ్యాపారులు బిల్లులు పేలిపోతున్నాయని లబోదిబోమంటున్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు వేగవంతానికి చర్యలు

అదానీ కంపెనీకి చెందిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 200 మంది సిబ్బందిని నియమించారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు వేగంగా జరగడం లేదనే కారణంతో వారందరినీ ఉద్యోగాల నుంచి తొలగించి కాంట్రాక్ట్ పద్ధతిన అప్పగించే ప్రక్రియ మొదలైంది. ప్రతి కాంట్రాక్ట్ దారునికి ఇన్ని మీటర్లు బిగించాలని అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో స్మార్ట్‌మీటర్లు బిగింపు వేగవంతం చేసేందుకు ప్రణాళికలు రచించి ముందుకు సాగుతున్నారు. ఇళ్లకు స్మార్ట్‌మీ టర్లు బిగించడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. వినియోగదారులు స్మార్ట్‌మీటర్ వద్దని చెబుతున్నప్పుడు మీటర్ మార్పు చేయకుండా విద్యుత్ సిబ్బంది ఇబ్బంది పెట్టడం చర్చనీ యాంశమవుతోంది. చాప కింద నీరులా స్మార్ట్ మీటర్ల బిగింపు సాగిపోతుంది.

ఖరీఫ్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

రైతుల సమస్యలను ముందుగానే పరిష్కరించాలి

ఇ-పంట, ఇకెవైసి నమోదు నూరుశాతం పూర్తి చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి దిశానిర్దేశం

ప్రజాశక్తి - ఏలూరు



రానున్న ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పటిష్టమైన ప్రణాళికలతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో గురువారం రానున్న ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ ముందస్తు ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడాలన్నారు. రైతుల సమస్యలను అధికారులు ముందుగానే గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో లక్షా 91 వేల 534 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతుండగా, ఐదు లక్షల 74 వేల 552 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని, దానిలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి మద్దతు ధరకు సేకరించేలా అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఖరీఫ్‌లో ధాన్యాన్ని తేమశాతాన్ని అనుసరించి క్వింటాల్‌కు కామన్ రకం రూ.2369, గ్రేడ్ ఎ రకానికి రూ.2389 చొప్పున ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తారన్నారు. గ్రామస్థాయిలో ఇ-పంట, ఇకెవైసి నమోదు నూరు శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలస్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీ ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలో 265 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లను తహశీల్దార్ తనిఖీ చేయాలన్నారు. గోనె సంచుల సరఫరాలో ఎటువంటి సమస్యల్లేకుండా నాణ్యమైన గోనె సంచులు రైతులకు అందించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, ట్రాన్స్‌పోర్టర్లు తదితరులు మాట్లాడుతూ ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు చెప్పారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, డిఎస్ఒ అబ్రహం, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శివరామ్మూర్తి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌కె.హబీబ్‌భాషా, ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, డిసిఒ శ్రీనివాస్, డిసిఎంఎస్ బిఎం కృష్ణమోహన్, ఎఫ్‌సిఐ డిఎం కెపి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకే రణభేరి

గత ప్రభుత్వ అడుగు జాడల్లోనే కూటమి పాలన

ప్రపంచ బ్యాంకు అప్పు కోసం విద్యారంగం ప్రయివేటీకరణ

ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

రణభేరి సభలో ఎంఎల్‌సి బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

గత ప్రభుత్వ అడుగుజాడల్లోనే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, గత 15 నెలల పరిపాలనలో అది స్పష్టంగా కన్పిస్తోందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకే యుటిఎఫ్ రణభేరి యాత్ర చేపట్టిందని తెలిపారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన, ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ చేపట్టిన రణభేరి యాత్ర గురువారం జిల్లాలోకి ప్రవేశించింది. యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు 500 మోటార్ సైకిళ్లతో రణభేరి యాత్రకు పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి పెనుగొండ, మార్టేరు, పాలకొల్లు, వీరవాసరం, భీమవరం, పిప్పర మీదుగా తాడేపల్లిగూడెం చేరుకుంది. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో ఏర్పాటు చేసిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవీణ్ ప్రకాష్ ముసుగులో ఉపాధ్యాయులను అంతర్జాలం కబంధ హస్తాల్లో పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. గత ప్రభుత్వం ఐదు డిఎలను పెండింగ్లో పెట్టిందన్నారు. పిఆర్‌సి అని చెప్పి రివర్స్ పిఆర్‌సి ఇచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలపై దెబ్బ మీద దెబ్బ కొట్టిందని చెప్పి గత ఎన్నికల్లో కూటమికి రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏకపక్షంగా ఓట్లు వేశారన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు తమకు ఓట్లేశారని, కడుపు నిండిపోయిందని చెప్పారని గుర్తు చేశారు. పిఆర్‌సి కమిషన్ నియమిస్తామని, పెండింగ్లో ఉన్న డిఎలు, వేల కోట్ల బకాయిలు చెల్లిస్తామని, ఉపాధ్యాయులకు మరింత గౌరవాన్ని పెంచుతామని చెప్పి మోసగించారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు అడుగుజాడల్లో గత, ప్రస్తుత ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. కేవలం రూ.1550 కోట్లు అప్పు కోసం విద్యారంగ ప్రయివేటీకరణకు పాలకులు పూనుకున్నారన్నారు. ఒకపక్క విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు రకరకాల సంస్కరణలు ప్రకటిస్తూ రెండోపక్క ఉపాధ్యాయులను పాఠాలు చెప్పనీయకుండా బోధనకు దూరం చేస్తున్నారన్నారు. ఇదే సందర్భంలో తల్లిదండ్రులకు మీ పిల్లలను ఇష్టమొచ్చిన చోట చదివించుకోమని డబ్బులిస్తున్నారని చెప్పారు. ఈ రకంగా ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో పది లక్షల మంది, కూటమి పరిపాలనలో ఒక్క ఏడాదిలోనే మూడు లక్షల మంది విద్యార్థులు ప్రయివేట్ బాట పట్టారని చెప్పారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తొలగించాలని డిమాండ్ చేశారు. పోరాట ఫలితంగా రూ.5 వేల కోట్లు బకాయిలు సాధించుకున్నామన్నారు. గత ప్రభుత్వం నియమించిన పిఆర్‌సి కమిషనర్ రాజీనామా చేశారని, కూటమి ప్రభుత్వం కనీసం కమిషనర్‌ను కూడా నియమించే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ నెల 25న గుంటూరులో రణభేరి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాదిమంది ఉపాధ్యాయులు ఆ సభకొచ్చి గర్జించబోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు శ్రీదేవి, సుభాషిణి, జ్యోతిబసు, చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భీమవరం: రణభేరి బైక్ జాతాలో అగ్రభాగాన ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి

నేడు జిల్లాకు యుటిఎఫ్ రణభేరి

ప్రజాశక్తి. ఏలూరు అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి బైక్ జాతా శుక్రవారం ఏలూరు జిల్లాలో పర్యటించనుంది. ఈ నెల 25న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరులో జరగనున్న భారీ బహిరంగ సభకు సమాయత్తంగా ఈ నెల 15న తునిలో ప్రారంభమైన ఉభయ గోదావరి జిల్లాల బైక్ జాతా నాలుగు రోజులు విజయవంతంగా పూర్తి చేసుకుని, శుక్రవారం ఉదయం ఉంగుటూరు వద్ద ఏలూరు జిల్లాలో ప్రవేశించనుంది. యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకత్వం, వందలాది ఉపాధ్యాయులతోపాటు ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి ఈ జాతాలో పాల్గొంటున్నారు. ఈ జాతాలో జిల్లాలోని అనేక పాఠశాల ఉపాధ్యాయులు తమ సమస్యలను నేతలకు అందజేస్తారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఉంగుటూరు మండలం నారాయణపురం హైస్కూల్ వద్ద నుండి ప్రారంభమై భీమడోలు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం, చింతలపూడి మీదుగా సాయంత్రం ఐదు గంటలకు ఏలూరు చేరుతుంది. ఏలూరు యుటిఎఫ్ కార్యాలయంలో ముగింపు సభ జరుగుతుంది. రణభేరి జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా ఆలీ, రవికుమార్ రుద్రాక్షి కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా, వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

12వ పిఆర్‌సి ప్రకారం మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలని, ఇంజినీరింగ్ కార్మికుల పది రోజుల, పారిశుధ్య కార్మికుల ఏడు రోజుల సమ్మె కాలపు జీతాలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నగర పాలక సంస్థ కమిషనర్‌కు మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు నాయకులు వినతిపత్రం అందజేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా 12వ పిఆర్‌సిని అమలు చేస్తూ మున్సిపల్ కార్మికులకు వేతనాలను పెంచాలని కోరారు. 2023 సంవత్సరం సమ్మె ఒప్పందంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, 10 సంవత్సరాల్లోపు సర్వీసు ఉన్నవారికి రూ.75 వేలు, 10 సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీసు ఉంటే సంవత్సరానికి అదనంగా రూ.2 వేలు ఇచ్చేలా ప్రభుత్వం వెంటనే జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ.ఐదు లక్షల నుండి రూ.7 లక్షలకు పెంచాలని, మట్టి ఖర్చులు రూ.15 వేల నుండి రూ.20 వేలకు పెంచాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు డిఎ బకాయిలు, సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్ మొదలగునవి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 20 నుండి 25 సంవత్సరాల సర్వీసు ఉన్నప్పటికీ ఎన్ఎంఆర్‌లకు నేటికీ రూ.13 వేలు వేతనం ఇస్తున్నారని, వీరికి మున్సిపల్ కార్మికులతో సమానంగా రూ.21 వేల వేతనాన్ని పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. బదిలీ కోవిడ్ కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలని, ఖాళీల భర్తీలో వీరికి ప్రధాన ప్రాధాన్యత ఇచ్చి నెలకు రూ.21 వేల వేతనాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చెత్తను తరలించే మున్సిపల్ వాహనాల డ్రైవర్లతో సమానంగా క్లాప్ డ్రైవర్లకు జిఒ నెం.36 అమలు చేయాలని, సకాలంలో ఏజెన్సీల నుండి పిఎఫ్, ఇఎస్ఐ సొమ్ము జమ చేసేలా చూడాలన్నారు. 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పట్టణ విస్తీర్ణం మేరకు కార్మికులను పెంచాలని, పని భారాన్ని తగ్గించాలని తదితర డిమాండ్లను ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు జె.గోపి, ఎం.ఇస్సాక్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో...



నూజివీడులో...

నూజివీడు టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులందరికీ పిఆర్‌సి ప్రకారం జీతాలు చెల్లించాలని, జులై సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించాలని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, సిబ్బంది సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, రజిని, శ్యామలాదేవి, పంగిడి అమ్మ, భారతి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ చెరువుపై అధికారుల చర్యలు

ప్రభుత్వ భూమి వేరు చేస్తూ చెరువు గట్టు ధ్వంసం

'ప్రజాశక్తి' వరుస కథనాలకు స్పందించిన తహశీల్దార్

ఇప్పటికీ అనుమతులు రద్దుచేయని మత్స్యశాఖ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిడమర్రు మండలం అడవికొలను గ్రామం తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలోని అక్రమ చేపల చెరువుపై అధికారులు చర్యలు చేపట్టారు. చెరువులోని పంటబోదెకు చెందిన ప్రభుత్వ భూమిని వేరుచేస్తూ గురువారం చెరువు గట్టును ధ్వంసం చేశారు. దీంతో ఏడాదికాలంగా కొనసాగుతున్న సమస్యను అధికారులు పరిష్కరించారు. 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వరుస కథనాలతో నిడమర్రు తహశీల్దార్ నేతృత్వంలోని మండల కమిటీ నిబంధనల ప్రకారం చర్యలకు పూనుకుంది. తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలోని 148 నుంచి 163 సర్వే నెంబర్లలో దాదాపు 70 ఎకరాల చేపల చెరువు ఉంది. ఈ చెరువులోని సర్వేనెంబర్ 159-4లో పంటబోదెకు సంబంధించిన 94 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వ భూమిని కలుపుకుని చేపల చెరువు తవ్వుకున్న సాగుదారులు గడిచిన పదేళ్లుగా అనుభవిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు. చెరువులో చేపలు ఉండటంతో 50 రోజులు గడువిచ్చారు. జులై 30వ తేదీతో గడువు పూర్తయినా చర్యలు మాత్రం తీసుకోకపోవడంపై ఈ నెల 15న 'అక్రమ చేపల చెరువులపై దొంగాట' అంటూ ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీంతో తహశీల్దార్ చర్యలు చేపట్టారు. స్థానిక మత్స్యశాఖ అధికారులు సహకారం అందించకపోయినా రెవెన్యూ అధికారులు పంటబోదెను సర్వే చేసి వేరుచేశారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.



చెరువుగట్టును ధ్వంసం చేయిస్తున్న అధికారులు

అనుమతులు రద్దు చేయని మత్స్యశాఖ

ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ ఏమాత్రం పరిశీలించకుండా పదేళ్ల క్రితం మత్స్యశాఖాధికారులు చేపల చెరువు తవ్వకానికి అనుమతులు ఇచ్చేశారు. ఫిర్యాదులతో అది బయటపడటంతో ఇప్పుడు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇంత జరిగినా ఇంకా ఆ చెరువుకు సంబంధించిన అనుమతులను మాత్రం మత్స్యశాఖాధికారులు రద్దు చేయకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా చెరువు అనుమతులు రద్దు చేస్తారో లేదో చూడాలి.

గోదారమ్మ దోబూచులాట

మళ్లీ పెరుగుతున్న వరద

ముంపులోనే గుండేటి వాగు, ఎద్దువాగు కాజ్‌వేలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వారం రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ.. నిలకడగా ఉంటూ మళ్లీ పెరుగుతూ గోదావరి వరద విలీన మండలాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. బుధవారం భద్రాచలంలో 32 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం గురువారం నాటికి అనూహ్యంగా పెరిగి 38 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో వరద ఉధృతి పెరుగుతుంది. ఇప్పటికే కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మిర్చి పంటకు అదును దాటుతుందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



కుక్కునూరు రూరల్ : గుండేటి కాజ్‌వేపై వరద

వేలేరుపాడు రూరల్: బుధవారం సాయంత్రానికి గోదావరి వరద తగ్గిందని ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నా మళ్లీ గురువారం పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఎడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్‌వే ముంపు నుంచి బయటపడక ముందే మరోసారి గోదావరి వరద పెరుగుతుండటంతో సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి.

పోలవరం: కొన్ని రోజులుగా పెరుగుతూ తగ్గుతూ దోబూచులాడిన గోదావరి వరద గురువారం సాయంత్రానికి నిలకడగా మారింది. ప్రాజెక్టు స్పిల్‌వే నుండి 6,74,121 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 31.070 మీటర్లు, స్పిల్వే దిగువన 22.050 మీటర్లు నీటిమట్టం నమోదైంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 38 అడుగులకు చేరుకుంది. ఎగువ కాపర్ డ్యామ్ వద్ద బ్యాక్ వాటర్ ప్రభావంతో గండిపోశమ్మ ఆలయంను వరద చుట్టుముట్టింది.

ఎర్ర కాలువ మిగులు భూములకు రక్షణ కల్పించాలి

పేదలకు న్యాయం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేదలు సాగు చేస్తున్న ఎర్ర కాలువ రిజర్వాయర్ మిగులు భూములకు రక్షణ కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. భూస్వాములతో కుమ్మక్కై అధికారులు పెడుతున్న పోలీస్ కేసులను, పేదలపై నిర్బంధాన్ని విడనాడాలని కోరారు ఈ మేరకు జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గురువారం వంద మందితో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా కమిటీ సభ్యులు యాగంటి సీత, జి.వెంకట్రావు మాట్లాడారు. టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఉన్న ఎర్రగాలువ మిగులు భూముల్లో జీవనోపాధి కోసం పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు పేదల పక్షాన ఉండి పంటకు, పేదలకు రక్షణ కల్పించాలని అధికారులను కోరారు. ఇరిగేషన్ భూముల్లో టి.నరసాపురం పోలీస్ యంత్రాంగం బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఎంఎల్ఎ పేదల పక్షాన లేకుండా భూస్వాముల పక్షాన ఉండడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు ప్రజల పక్షాన ఉండి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. భూస్వాములు, పోలీసు యంత్రాంగం పేదలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురి చేసే వైఖరిని విడనాడకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని రూపొందిస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.సూర్యకిరణ్, కె.సుబ్బారావు, పి.పోతురాజు, సిహెచ్.రవి, ఎం.సుధారాణి, కలపాల గాంధీ చిరమయ్య, కె.రాజు, సరియం దుర్గమ్మ, సిహెచ్.లక్ష్మి, ఎ.కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న నేతలు, పేదలు

బార్లకు లాటరీ

ఏలూరు అర్బన్ :2025 - 28 సంవత్సర కాలానికి ఓపెన్ కేటగిరిలో మద్యం బార్లకు గురు వారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి లాటరీ తీసి బార్లు కేటాయించారు. జిల్లాలో నూతన బార్ పాలసీ 2025-28లో భాగంగా మొదటి నోటిఫి.కేషన్‌లో మిగిలిన తొమ్మిది ఓపెన్ కేటగిరి బార్లకు ఈ నెల మూడో తేదీన నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖా స్తులకు చివరి తేదీ అయిన 14వ తేదీకి దరఖాస్తులు రాకపోవడంతో మరో నాలుగు రోజులు పొడిగించారు. అయినప్పటికీ తొమ్మిది బార్లలో కేవలం ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని రెండు బార్లకు మాత్రమే దరఖాస్తులు రావడంతో గురువారం వాటిని కలెక్టర్ లాటరీ ద్వారా ఎంపిక చేశారు. మిగిలిన ఏడు బార్లకు తిరిగి దరఖాస్తులు ఆహ్వానిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. ఈ లాటరీ ద్వారా ప్రభుత్వం వారికి రూ.59.13 లక్షల ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారి ఎ.ఆవులయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు జి.పాండురంగారావు, అజయ్ కుమార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను మూసివేయొద్దు

ఆప్కాబ్ చైర్మన్ గన్నికి పలువురి వినతి


గన్నితో మాట్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల - కురెళ్లగూడెం గ్రామాల మధ్యలో ఉన్న 364-ఎ రైల్వే లెవెల్ క్రాసింగ్ మూసివేత ప్రతిపాదనను విరమించుకోవాలని ద్వారకాతిరుమల, భీమడోలు మండలాలకు చెందిన పలువురు గ్రామస్తులు ముఖ్యంగా రైతులు కోరుతున్నారు. ఈ మేరకు ద్వారకాతిరుమల మండలానికి చెందిన పి.కన్నాపురం, భీమడోలు మండలానికి చెందిన పూళ్ల వాటి పరిసరాల్లో ఉన్న వందలాది మంది ప్రజలు గురువారం భీమడోలులోని టిడిపి కార్యాలయంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును కలిశారు. ఈ మేరకు విజ్ఞప్తులు, వినతులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పనిసరి అయితే ఆ ప్రాంతంలో బ్రిడ్జి అండర్ ట్రాక్ నిర్మించి తమను ఆదుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సమస్యను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలతో పాటు కూటమి పార్టీకి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేతకు గ్రామసభ అంగీకారం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు వద్ద రైల్వే ట్రాక్‌పై నిర్మించనున్న రోడ్డు ఓవర్ బ్రిడ్జి కారణంగా ఆ ప్రాంతంలో ఉన్న రైల్వే గేటు మూసివేత విషయమై రెండోసారి గ్రామసభను గురువారం తహశీల్దార్ బి.రమాదేవి, గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని షరతులతో కూడిన తీర్మానాలతో గ్రామసభ రైల్వే గేట్ మూసివేతకు అంగీకారం తెలిపింది. రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల కలిగే ప్రయోజనాలు, రైల్వే గేట్ మూసివేత వల్ల తొలగనున్న ఇబ్బందులు ఇతర అంశాల గురించి తహశీల్దార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వివరించారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమడోలు గ్రామ రెవెన్యూ అధికారులు వినయ్, ప్రతాప్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్ఎస్.గిరి, భీమడోలు నీటి సంఘం అధ్యక్షులు కె.ప్రసాద్, యుగంధర్, మదన్ పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి సాయం అందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎర్రంపల్లి సొసైటీ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని చైర్‌పర్సన్ తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, డిసిసిబి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, డిసిసిబి సిఇ సింహాచలం కోరారు. ఏలూరులో డిసిసిబి కార్యాలయం వద్ద వారిని మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. అభివృద్ధి పథంలో నడిపించడానికి కొన్ని ప్రణాళికలు ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌తో కలిసి చేస్తున్నామని, సహాయ సహకారాలు అందించాలని కోరారు. గతంలో ఇచ్చిన విధంగా ఎల్‌డి పట్టాలకు రుణాలు ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గన్ని వీరాంజనేయులు చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి ఎల్‌డి పట్టాలకు రుణాలకు ఇప్పించేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అఖిల్, జయవాసు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పొట్లగట్లగూడెం హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కె.అఖిల్, డి.జయవాసు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూల్ హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 16వ తేదీన జిల్లాస్థాయిలో ఏలూరులో ఎఎస్ఆర్ స్టేడియంలో జరిగిన వి14, వి17 బాలుర భాగంలో ఫ్రీ స్టైల్ రిలే విభాగాల్లో ఇద్దరు విద్యార్థులు పోటీ చేసి రాష్ట్రస్థాయి ఎస్‌సిఎఫ్ఐ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

400 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ విజయవాడ రూరల్, మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ విజయవాడ, విజయ డెంటల్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఐ అండ్ డెంటల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 400 మంది విద్యార్థులకు కంటి, పళ్ల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తామని రావి సురేష్‌బాబు తెలిపారు. అవసరమైన వారికి ఉచిత కళ్ల జోళ్లు యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గద్దె శేషగిరి, తాతినేని శ్రీహరిరావు, పోలవరపు నరసింహారావు, ఎంపిపి కొండా దుర్గాభవాని, గ్రామ ప్రముఖులు కాటేపల్లి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు చిలుకూరి వెంకటేశ్వరరావు, తల్లిబోయిన సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షులు పెదబాబు, గిరిబాబు, కొత్తపల్లి భుజంగరావు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకునేలా సహకరించాలి

ప్రజాశక్తి - మండవల్లి

తరుగుమూల ఇళ్ల స్థలాల్లో లబ్ధిదారులు నివాసాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటానని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ హామీ ఇవ్వడం హర్షణీయమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు అప్పారావు అన్నారు. ఆయన నివాసంలో గురువారం ఐక్యవేదిక సభ్యులతో కలిసి మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా సహకరించాలని ఆయన కోరారు. లబ్ధిదారుల పక్షాన నిలబడి నిర్విరామంగా పోరాటం సలిపిన సిపిఎంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కార్యవర్గ సభ్యులు జంగాల శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, బండి రంగారావు, అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

దాడికి పాల్పడ్డ ముఠా అరెస్టు

కారు, రెండు బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మహిళపై కత్తులతో దాడి చేసి ఆమె వద్ద ఉన్న బంగారం ఎత్తుకుపోయిన ఘటనలో నలుగురు నిందితుల ముఠాను ఏలూరు మూడో పట్టణ పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. ఏలూరు శివారు పట్లూరు ప్రాంతంలో సింగంశెట్టి మల్లేశ్వరమ్మ అనే మహిళ కిరాణాషాపు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతోంది. ముందువైపు ఇంట్లో నివాసం ఉంటున్న నాగదుర్గాభవాని గంగులూరి రవితేజతో కలిసి మల్లేశ్వరమ్మ మెడలోని బంగారు నాన్‌తాడు, నల్లపూసల తాడును చోరీ చేసి పంచుకోవాలని ప్లాన్ చేశారు. ఈ నెల 14న సాయంత్రం ఆరు గంటల సమయంలో మల్లేశ్వరమ్మ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన నాగ దుర్గాభవాని రవితేజను పిలిపించింది. రవితేజ ఆమె ఇంట్లోకి వెళ్లి నాన్‌తాడు లాక్కునేందుకు ప్రయత్నించగా ఆమె ప్రతిఘటిస్తూ కేకలు వేయడంతో భయపడిన రవితేజ చాకుతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి బైక్‌పై పరారయ్యాడు. ఏలూరు త్రీటౌన్ సిఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం మూడు బృందాలను ఏర్పాటు చేయగా రవితేజ, నాగదుర్గాభవాని వారికి సహకరించిన నాగరాజు, సురేష్ నలుగురూ కారు మాట్లాడుకుని ఏలూరు మినీబైపాస్ వైపు నుంచి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.అంకంపాలెం గ్రామ శివారులో గురువారం పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... పి.అంకంపాలెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,560 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారందరి పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కాట్రేనిపాడుకు నాగుర్జునసాగర్ ఎడమ కాలువ నీరు

ప్రజాశక్తి - ముసునూరు

నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీరు కాట్రేనిపాడు గ్రామానికి వచ్చాయని వేంపాడు మేజర్ డిసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి సాగర జలాలు వచ్చాయని చెప్పారు. గత 30 ఏళ్ల నుంచి ఎన్నడూ కూడా కాట్రేనిపాడు చెరువులకు నీరు రాలేదని చెప్పారు. ఈ ఏడాది మంత్రి పార్థసారథి కృషి చేశారన్నారు. టిడిపి నాయకులు గద్దె రఘుబాబు, బొమ్మకంటి శ్యామలరావు, గద్దల మోహన్‌రావు, సూర్యదేవర శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, మేదరమెట్ల సురేంద్ర, మండలపు ధర్మరాజు, కొల్లి గంగారం, తదితరుల సహకారంతో నీరు వచ్చినట్లు తెలిపారు.

వట్లూరులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక వట్లూరులోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 12 మంది శిక్షణ పొందుతున్న యువత రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి హాజరైన ముఖ్య అతిథి యూనియన్ లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రి మాట్లాడుతూ 45 రోజులు స్వయం ఉపాధి శిక్షణ పొందుతున్న ప్రతి బ్యాచ్‌తో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. శిక్షణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహిస్తున్నందుకు ఆ సంస్థ డైరెక్టర్ ఫణి కిషోర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ డైరెక్టర్ ఫణి కిషోర్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, పిఆర్ఒ కెవి.రమణ, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే పరిసరాల శుభ్రతపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని ప్రతిభ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిగిరి పిచ్చోడు తెలిపారు. అయ్యవారి రుద్రవరంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జయశ్రీ, మండవల్లి క్లస్టర్ సిఆర్‌పి సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ కార్యకర్త వాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమంలో భాగంగా గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎంపిడిఒ చెన్నరాఘవేంద్రనాథ్, టిడిపి మండలాధ్యక్షులు యనమదల వాసు, పిఎసిఎస్ గ్రామ అధ్యక్షులు గోగినేని రామకృష్ణ, గ్రామ సర్పంచి తొమ్మండ్రు బుజ్జి తెలిపారు. తుక్కులూరు గ్రామ పరిధిలో ఉన్న సచివాలయంలో ఈ మేరకు గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు.

నేడు న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని చంద్రబాబు ఇచ్చిన వాగ్దానం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం ఉదయం పది గంటల నుంచి ఎంఎల్ఎ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. న్యాయవాదులందరూ ఉదయం 9.30 గంటల కల్లా నూజివీడు కోర్టు ప్రాంగణానికి చేరుకోవాలని, అక్కడి నుంచి బైక్ ర్యాలీతో నిరసన కార్యక్రమం జరిగే ప్రదేశానికి వెళ్లి నిరసన తెలపాలని నూజివీడు న్యాయవాదుల సంఘం వారు తెలిపారు.

నేడు చలో మెడికల్ కాలేజీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేస్తుందని, పేద, మధ్యతరగతి విద్యార్థులు నష్టపోతారని, కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా శుక్రవారం ఏలూరు మెడికల్ కాలేజీలో నిర్వహించే చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత పెద్ద ఎత్తున తరలి రావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం పోస్టర్‌ను ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు పాతినవలస రాజేష్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు నెరుసు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలో 47వ డివిజన్‌లో ఉన్న ఏనుగులుకుంట భూమిని ప్రజా అవసరాలకు ఉపయోగించి భూ కబ్జాదారుల నుంచి ఆ భూమిని కాపాడాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించింది. సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, నగర కమిటీ సభ్యులు ఎం.ఇస్సాక్, జె.గోపీ, అరుణకుమారి తదితరుల ప్రతినిధి బృందం గురువారం ఏలూరు కార్పొరేషన్ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971 నుంచి ఈ భూమి వివాదాల్లో నడుస్తూ నిరుపయోగంగా మారిందన్నారు. ఈ భూమిని ప్రజా శ్రేయస్సు దృష్ట్యా పూడిక చేశారని, దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను ఆ భూమిపై పడి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి న్యాయస్థానాల్లో కేసులు పెడుతూ భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని కమిషనర్‌కు వివరించారు. జిల్లా కోర్టు గతంలోనే ఇలా వేసిన కేసును కొట్టి వేసిందని, తిరిగి మళ్లీ హైకోర్టులో కేసు వేయడంతో ప్రజలకు ఆ భూమి ఉపయోగపడకుండా కాలయాపన జరుగుతుందన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఏనుగులకుంట భూమిలో కమ్యూనిటీ హాల్, అంగన్వాడీ సెంటర్, కళ్యాణ మండపం, వాటర్ ట్యాంక్ వంటి ప్రజావసరాలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏళ్ల తరబడి ఖాళీ స్థలాలుగా పడి ఉండడంతో చెత్త పేరుకుపోయి తీవ్రమైన దుర్గంధం వెదజల్లేందుకు కారణమవుతుందని చెప్పారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ భూమి వివరాలు రప్పించుకుని విచారణ జరిపి ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మహిళా కండక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మహిళా కండక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.సూర్యారావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన మాటాడారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల పడుతున్న ఇబ్బందుల గురించి జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపోకు చెందిన మహిళా కండక్టర్ యడ్లపల్లి కుష్మకుమారి మాట్లాడి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలిపారు. దీంతో డిపో మేనేజర్ ఆమెను పిలిచి ఎంక్వయిరీ ఉందని, అప్పటివరకు డ్యూటీకి రావొద్దని చెప్పి పంపించేశారని తెలిపారు. పరిమితికి మించి బస్సులో ప్యాసింజర్లు ఎక్కుతున్నారని, గర్భిణులు బస్సు ఎక్కాలంటే భయపడే పరిస్థితి ఉందని చెప్పారు. పరిమితికి మించి ప్యాసింజర్లు ఎక్కుతుంటే అధికారులు మా బాధ పట్టించుకోండని చెప్తే ఆ మహిళా కండక్టర్‌ను విధుల నుంచి తొలగించడం చాలా అన్యాయమన్నారు. పరిమితికి మించి ప్యాసింజర్లు బస్సులో ఎక్కితే ఏమైనా ప్రమాదం జరిగితే అందుకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఆర్‌టిసి డిపోల వద్ద పోలీసువారిని ఉంచి పరిమితికి మించి ప్యాసింజర్లు బస్సు ఎక్కకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రజలకు ఎటువంటి ప్రాణహాని జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. మహిళా కండక్టర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోకపోతే ప్రజా సంఘాల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌జియుకెటి నూజివీడు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడుకు చెందిన జూనియర్ అండర్ ఆఫీసర్లు షేక్ కరీనా జాను, ఇందులు ఈ నెల ఒకటి నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన ఆలిండియా తలసానిక్ క్యాంపును విజయవంతంగా పూర్తి చేశారు. జాతీయ స్థాయిలో ఎన్‌సిసి క్యాడెట్ల నైపుణ్యం, ధైర్యాన్ని పరీక్షించడానికి ఈ క్యాంపు నిర్వహిస్తారు. కర్నల్ బాలిందర్ సింగ్ మార్గదర్శనంలో వారు టెంట్ పిచింగ్ పోటీలో బంగారు పతకాన్ని సాధించి తమ కృషికి తగిన ఫలితాన్ని పొందారు. అంతేకాకుండా షేక్ కరీనా జాను జడ్జింగ్ డిస్టెన్స్, ఫీల్డ్ సిగ్నల్స్ పోటీలో టాప్ ర్యాంక్ సాధించడమే కాకుండా ఆలిండియా కంటిజెంట్ డ్రిల్‌లోనూ పాల్గొని ఆర్‌జియుకెటి నూజివీడుకు గర్వకారణంగా నిలిచారు. ఇందు కూడా తన ధైర్యాన్ని చూపించి ఒబ్బకిల్ కోర్సులో టాప్ ప్లేస్ సాధించారు. అంతేకాకుండా అరుణాచల్ ప్రదేశ్‌లోని ఎన్ఐఎంఎఎస్‌లో నిర్వహించిన అడ్వాన్స్ అడ్వెంచర్ క్యాంపును నూజివీడు క్యాడెట్ ధాత్రిజ విజయవంతంగా పూర్తిచేసింది. క్యాంపును విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థినులను ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా.లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డాక్టర్ చిరంజీవి అభినందించారు.

కృష్ణకు రాజ్ న్యూస్ బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక తపస్ విద్యా సంస్థల అధినేత ప్రముఖ ఆడిటర్ రోటరీ పూర్వపు అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణకు రాజ్ న్యూస్ (తెలుగు) ప్రకటించిన బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డును రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్ చేతులమీదుగా అందుకున్నారు. విజయవాడలోని ఎస్ కన్వెన్షన్ హాలులో బుధవారం రాత్రి పెద్ద ఎత్తున నిర్వహించిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మంత్రులతో పాటు శాసన సభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ రాజ్, ఎంఎల్ఎ గద్దె రాంమోహన్, న్యూస్ సిఇఒ లక్ష్మీరావు పాల్గొన్నారు.

విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న విఆర్‌ఎల ప్రధాన సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల విఆర్‌ఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం మండలాధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ విఆర్‌ఎ ప్రధాన సమస్యలైన పే స్కేలు అమలు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, అర్హులైన విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. రాష్ట్ర గ్రామ రెవెన్యూ సేవకుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ ధర్నాలో విఆర్‌ఎలు బలరామ్, వసంతరావు, సురేష్, ప్రసాద్, నూర్జహాన్, శివపార్వతి, భవాని, గంగాధరరావు, అన్నామణి, సునీత, సాయి, ముసలయ్య, కోటేశ్వరరావు, సుమతి, చంద్రకాంత్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు దస్తావేజు లేఖర్ల నిరసన

పోలవరం :సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 19, 20 తేదీల్లో పెన్ డౌన్ కార్యక్రమం చేస్తున్నట్లు పోలవరం మండల దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం వారు తెలిపారు. ఈ మేరకు సబ్ రిజిస్టార్ జె.రత్నకుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లేఖర్లు సారిక శివకుమార్, పెంజర్ల వెంకటరామారావు, రాకుర్తి హరినాధరావు, సారిక అప్పారావు, పెరుమాళ్ల గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒటిపి విధానం వల్ల ప్రజలు రిజిస్ట్రేషన్ చేయించుకోవటానికి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.

మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - భీమడోలు

స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలకు వచ్చిన ప్రతి ఒక్కరికి రక్తహీనత పరీక్షలు విధిగా నిర్వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యు.శోభ కోరారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యులు పి.అరుణ జ్యోతి, డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో పూళ్లలో నిర్వహిస్తున్న క్యాంపును గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.

కొయ్యలగూడెం : స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా రాజవరం, గంగవరంలో బయ్యన్నగూడెం పిహెచ్‌సి ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి ఏలేటి తుక్కయ్య మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు మహిళలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. వైద్యాధికారి వి.సత్యనారాయణ మాట్లాడుతూ మహిళల్లో కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించకపోతే చాలా ప్రమాదకరంగా పరిణమించి, ప్రాణాపాయానికి దారి తీస్తుందన్నారు. .

ముసునూరు :మండలంలోని చింతలవల్లిలో ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్థూల కాయ నివారణ, చక్కెర, నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో టిడిపి చింతలవల్లి నాయకులు నాగంబాబు, కాటేపల్లి సురేంద్ర, పాలడుగు చిన్ని, అంగన్వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండలంలోని తుక్కులూరు గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ (హాస్పిటల్)లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. నూజివీడు ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ ఈ క్యాంపులో ప్రత్యేక పరీక్షలు, కంటి పరీక్షలు చేసి అవసరం మేరకు ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ సర్పంచి తోమండ్రు బుజ్జి, ఉప సర్పంచి అచ్చి కాసులు, పంచాయతీ అధికారులు, తుక్కులూరు పిఎసిఎస్ అధ్యక్షులు గోగినేని రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : ఆరోగ్యకరమైన మహిళలతోనే బలమైన కుటుంబం ఏర్పడుతుందని మండల వైద్యాధికారిణి జె.కల్పనారాణి తెలిపారు. మండలంలోని తెడ్లం గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కల్పనారాణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి కల్పనారాణి మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం తీసుకుంటూ కుటుంబ సంక్షేమంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి వీరారెడ్డి (చినబాబు), గంధ్ర కృపాకర్‌రెడ్డి, దించినాల బ్రహ్మం, యలమంచి భానుప్రసాద్, బండారు నాగేశ్వరరావు, రాచప్రోలు నవీన్, పిహెచ్ఎన్ కొవ్వాడమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సొంగా సిద్ధూ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మహిళల్లో వచ్చే కేన్సర్ వంటి ప్రమాదకర రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి సూచించారు. మండలంలోని తాడువాయి పిహెచ్‌సిలో గురువారం నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి బాబ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ మనోజ్ఞ, హెచ్ఇఒ సత్యనారాయణ, ఐసిడిఎస్ పిఒ పరిమి బ్యూలా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం, కుటుంబం బలపడుతుందని శ్రీహరిపురం ఎంపిటిసి సభ్యురాలు మరీదు వరలక్ష్మి, కోమర్రు గ్రామ సర్పంచి కె.శ్రీసాయికృష్ణ అన్నారు. గురజ పిహెచ్‌సి పరిధిలోని శ్రీహరిపురంలో గురువారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైద్య శిబిరాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముదినేపల్లి, దేవపూడి, గురజ పిహెచ్‌సిల్లో జరిగిన సమావేశాల్లో వైద్యాధికారులు శాంతి శ్రీ, మధుసూదన్‌రావు, రాణి శిరీష బాయి కోరారు.